## క్లుప్తంగా

### నేడు చేపల చెరువు వేలం

అమరాపురం: స్థానిక గ్రామ సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అమరాపురం చేపల చెరువులో చేపల పెంపకానికి సంబంధించి వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఈరన్న, సర్పంచ్ వాగేష్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

### నిబంధనలు పాటించండి

చిలమత్తూరు: వాహనదారులు రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం ఆయన కోడూరు మన్రో తోపు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### జాబిలికి సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న 'జాబిలి'

పెనుకొండ: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి, రచయిత జాబిలి చాంద్‌బాషాకు సేవా పురస్కారం లభించింది. ఆదివారం అనంతపురం జిల్లా కేంద్రంలో రెవెన్యూ భవన్‌లో జరిగిన రాష్ట్ర భాషోపాధ్యాయ వేడుకల్లో ఆయనకు భాషా సేవా పురస్కారాన్ని అందించారు. భాష అభ్యున్నతికి కృషి చేస్తుండడంతో ఆయనకు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర భాషోపాధ్యాయ అధ్యక్షుడు అంకాల కొండయ్య చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్లు జాబిలి తెలిపారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

మడకశిరరూరల్: మండల పరిధిలోని రేకులకుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి ఆదివారం కర్ణాటక రాష్ట్రం ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన సంస్థ ధర్మకర్త నరేంద్ర హెగ్గే రూ.1.50 లక్షల చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. తమ తల్లి హేమవతి హెగ్గే జ్ఞాపకార్థం చెక్కును అందజేశామని నరేంద్ర పేర్కొన్నారు. అనంతరం ఆలయ నిర్మాణం పనులను పరిశీలించారు.

### విలువిద్యలో గోల్డ్‌మెడల్



బంగారు పతకాన్ని అందుకుంటున్న హవిషా

హిందూపురం: హిందూపురానికి చెందిన వ్యాపారి ఫణిరాజ్, సహనా కుమార్తె, 9వ తరగతి విద్యార్థిని హవిషా విలు విద్యలో బంగారు పతకం సాధించింది. మధ్యప్రదేశ్‌లోని భూపాల్ ఈనెల 28, 29 తేదీల్లో జరిగిన 2022–23 నేషనల్ అండర్ 19 ఇండోర్ ఆర్చరీ టోర్నమెంట్ (విలువిద్య) పోటీల్లో ప్రతిభ కనబరచి మొదటిస్థానంలో నిలిచి బంగారు పతాకం సాధించినట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ప్రతిభ కనబరచిన హవిషాను పలువురు అభినందించారు.

### నేడు వాహనాల వేలం

అమరాపురం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ దగ్గర వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు.

**వాహనాల వేలం రేపు**

హిందూపురం టౌన్: స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 31న స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య ఆదివారం పేర్కొన్నారు.

### వెండి ఆభరణాల వితరణ

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయానికి కర్ణాటక ప్రాంతంలోని తుమకూరు జిల్లా సిరాకు చెందిన సిద్దగంగమ్మ కుటుంబ సభ్యులు రెండు వెండి చామరములతో పాటు మృగ వెంట్రుకలతో కలిపి ఆలయానికి వితరణ చేశారు. ఆభరణాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, అర్చకులు శ్రీనివాసులకు అందజేశారు.

### పొంచి ఉన్న ప్రమాదం



పాచి పేరుకుపోయిన రైల్వే అండర్ బ్రిడ్జి

పెనుకొండ రూరల్: పెనుకొండ నుంచి శెట్టిపల్లికి వెళ్లే రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు నిత్యం బ్రిడ్జి గుండా వర్షం నీరు ప్రవహించేది. ప్రవాహం తగ్గినప్పటికీ నీటి ప్రవాహానికి రహదారి మొత్తం పాచి పట్టింది. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఓ ద్విచక్ర వాహనదారుడు కిందపడటంతో ఆస్పత్రి పాలయ్యాడు. ఇప్పటికైనా రైల్వే అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మువ్వల సవ్వడి

• సంప్రదాయ కళలో రాణిస్తున్న చిన్నారులు • వివిధ ప్రాంతాల్లో నాట్య ప్రదర్శనలు • ప్రతిభతో అవార్డులు పొందిన నృత్యకారులు

మన సంస్కృతిని చాటిచెప్పేవి నృత్యం, సంగీత కళలు. అలాంటి సంప్రదాయ నృత్యరీతులను అభ్యసించేందుకు చిన్నప్పటి నుంచే కొందరు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సంప్రదాయ నృత్యాలను అభ్యసించడమే కాదు రాష్ట్ర, జాతీయ వేదికలపై ప్రదర్శనలతో అవార్డులనూ సొంతం చేసుకుంటున్నారు.

– హిందూపురం టౌన్:



నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలిక పేరు నీహాస్విఅతిథి బండారు. హిందూపురంలోని ఓ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతోంది. మూడేళ్ల వయస్సు నప్పటి నుంచే నీహాస్వి నాట్యం నేర్చుకుంటోంది. ఇప్పటికే పలు వేదికలపై ప్రదర్శనలు చేసి నాట్య సింధూర, కార్తీక నంది అవార్డు, తెలంగాణ రాష్ట్రం నుంచి రెండో కూచిపూడి నాట్య దినోత్సవంలో ప్రదర్శన చేసి ప్రశంస పత్రాలను అందుకున్నారు. భరత నాట్యమంటే తనకు ఎంతో ఇష్టమని, మంచి నృత్యకారిణిగా రాణించాలన్నదే తన కోరికని నీహాస్వి చెబుతోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలిక పేరు ఎం.ప్రియదర్శిని. హిందూపురంలోని ఓ స్కూల్‌లో 4వ తరగతి చదువుకుంటోంది. నాట్యంపై మక్కువతో సంవత్సర కాలంగా నృత్యం నేర్చుకుంటోంది. ఇందులో భాగంగానే భరత నాట్యంలో ప్రతిభ చూపుతోంది. 9 రాష్ట్ర స్థాయి వేదికలపై ప్రియదర్శిని ప్రదర్శనలు ఇచ్చింది. జ్యోతిర్మయి ప్రతిభా పురస్కారం, కార్తీక నంది అవార్డులను అందుకుంది. మొదటి నృత్య ప్రదర్శనను హైదరాబాద్‌లో చినజీయర్ స్వామి ఎదుట చేయడం నాకు ఎంతో గర్వంగా అనిపించిందని ప్రియదర్శిని తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మరెన్నో ప్రదర్శనలు ఇచ్చి మంచి నృత్యకారిణిగా రాణిస్తానని ధీమా వ్యక్తం చేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న చిన్నారి పేరు సురువు శ్లోక. హిందూపురంలోని ఓ స్కూల్‌లో 1వ తరగతి చదువుతోంది. మూడేళ్ల వయస్సు నుంచే నృత్యంలో శిక్షణ తీసుకుంటోంది. తల్లిదండ్రులతో పాటు గురువు చంద్రబాను చతుర్వేది ప్రోత్సాహంతో ఇప్పటికే పలు వేదికలను ప్రదర్శన ఇచ్చింది. నాట్య సింధూర, కార్తీక నంది అవార్డులు సొంతం చేసుకుంది. నృత్యకారిణిగా మంచి పేరు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని, తల్లిదండ్రులు, గురువులు గర్వపడేలా చేస్తానని సురువు శ్లోక చెబుతోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలిక పేరు రుహానిక. హిందూపురంలోని ఓ స్కూల్‌లో 3వ తరగతి చదువుతోంది. నాట్యంపై ఉన్న ఆసక్తితో రెండేళ్లుగా ప్రత్యేక శిక్షణ తీసుకుంటోంది. ఇందులో భాగంగానే పలు వేదికలపై ప్రదర్శనలిచ్చి ఆహుతుల మన్ననలతో పాటు అవార్డులనూ సొంతం చేసుకుంది. నాట్యసింధూర, కార్తీక నంది అవార్డు, తెలంగాణా రాష్ట్ర నుంచి రెండో కూచిపూడి నాట్య దినోత్సవంలో ప్రదర్శనకు ప్రశంసాపత్రాలను అందుకుంది. తల్లిదండ్రులు ఎంతగానో తనను ప్రోత్సహిస్తున్నారని మంచి ప్రదర్శనతో మరిన్ని పురస్కారాలను సాధిస్తానని రుహానిక చెబుతోంది. నృత్యకారిణిగా చూడాలనే వారి కోరికను నెరవేరుస్తానని తెలిపింది.

### సిద్ధేశ్వరస్వామికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాలైన శిర, హిరియూర్, తుమకూర్, పావగడ, బెంగళూరు, మధుగిరి ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

### భరతనాట్యం పరీక్షల్లో ప్రతిభ

హిందూపురం టౌన్: అఖిల భారతీయ గంధర్వ మహా విద్యాలయ మండల్, ముంబాయి యూనివర్సిటీ నిర్వహించిన ప్రారంభిక్య భరతనాట్యం మొదటి సంవత్సరం పరీక్షల్లో పట్టణానికి చెందిన అభిజ్ఞ నృత్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు ఆధ్యా, సహజ సహస్ర, నందితలో 80/100 మార్కులు సాధించి డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించగా, వర్ష, బండారు రుహానిక, గ్రీష్మ, వేదశ్రీలు మొదటి తరగతిలో ఉత్తీర్ణులైనట్లు నృత్యాలయం నృత్య గురువు చంద్రభాను చతుర్వేది తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

### సీనియర్ న్యాయవాది మృతి



గంగాధరప్ప (ఫైల్)

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షికి చెందిన సీనియర్ న్యాయవాది ఎం.గంగాధరప్ప (69) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. 30 ఏళ్ల న్యాయవాది వృత్తిలో ఉంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా గంగాధరప్ప పనిచేశారు. విషయం తెలుసుకున్న హిందూపురానికి చెందిన న్యాయవాదులు రామచంద్రరెడ్డి, నాగరాజురెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, రమేష్, శ్రీరాములు, అంజినేయులు, గోపాల్, జ్ఞానేష్, మాధవయ్య తదితరులు గంగాధరప్ప భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

# నవరత్నాలతో పేదలకు భరోసా



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువతి పేరు రుక్మిణి. వీరిది రొళ్ల మండలం గొట్టుగుర్కి గ్రామం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈమె కుటుంబానికి రూ.2,68,376 లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరా రూ. 9,106, వైఎస్సార్ రైతు భరోసా రూ.24,500, వైఎస్సార్ పంటల భీమ రూ.1159, వైఎస్సార్ సున్న వడ్డీ రూ.905, వైఎస్సార్ రైతు సున్న వడ్డీ రూ.831, జగనన్న విద్య దీవెన ద్వారా రూ.2,875, జగనన్న అమ్మఒడి రూ.29 వేలు, ఇంటి స్థలం కోసం రూ.2 లక్షలు అందింది. సీఎం జగనన్న చేసిన మేలును ఎప్పటికీ మర్చిపోనని రుక్మిణి హర్షం వ్యక్తం చేశారు.



రొళ్ల : గొట్టుగుర్కిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

• ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: ముఖ్యమంత్రి జగనన్న ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాల పథకాలతో పేదల జీవితాలకు కొండంత భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గుడ్డగుర్కి సచివాలయం పరిధిలోని గొట్టుగుర్కి, గొట్టుగుర్కి గొల్లహట్టి, క్యాతప్పపాళ్యం గ్రామాల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ సచివాలయం వ్యవస్థను తీసుకువచ్చి వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. మూడున్నరేళ్ల పాలనలో 95 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకు మాత్రమే దక్కుతుందన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ హరికృష్ణ, ఎంపీటీసీ లింగరాజు, వైస్ ఎంపీపీ రత్నమ్మ, ఎంపీడీఓ రామారావు, ఏపీఓ నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షుడు మోతీరాంనాయక్, మార్కెట్ యార్డు చైర్మన్ జయరామప్ప, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, ఎస్ఐ వెంకటరమణ, నాయకులు శ్రీరామప్ప, నరసింహమూర్తి, బండెప్ప, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# బలిజలు ఐక్యంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: బలిజలు ఐక్యంగా అన్ని రంగాలతో పాటు రాజకీయంగా కూడా అభివృద్ధి చెందాలని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ తెలిపారు. ఆదివారం స్థానిక సాయిరాంఫంక్షన్ హాల్‌లో బలిజల ఆత్మీయ సమావేశం జరిగింది. నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ ఫిబ్రవరి 16న శ్రీకృష్ణదేవరాయల జయంతిని హిందూపురం పెద్ద ఎత్తున అట్టహాసంగా నిర్వహించడంతో పాటు పట్టణంలో ఏర్పాటు చేస్తున్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమాన్ని అందరి సహకారంతో నిర్వహించడానికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

**రథోత్సవానికి విరాళం..**

పట్టణంలో మెయిన్‌బజారులో వెలసిన పేట వెంకటరమణస్వామి రథోత్సవానికి ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్‌ను ఆలయ ఈఓ నరసింహమూర్తి , కమిటీ సభ్యులు ఆదివారం ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వానించారు. నవీన్‌నిశ్చల్ .. రథోత్సవానికి తనవంతుగా రూ.1 లక్ష విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తండ్రి అంత్యక్రియలు పూర్తి



గౌస్ సాబ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్

హిందూపురం: ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తండ్రి గౌస్ సాబ్ అనారోగ్యంతో శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం కర్నూలు లో జరిగిన అంత్యక్రియలకు హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ , కర్నూలు ఎమ్మెల్యే అఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీ తండ్రి భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. హిందూపురం నుంచి పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఎమ్మెల్సీ తండ్రి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# ముమ్మరంగా ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

హిందూపురం టౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి ఆదివారం పట్టణంలో ముమ్మరంగా ప్రచారం చేశారు. బాలయేసు జూనియర్, డిగ్రీ కళాశాలలో, అలాగే బోయపేట, రహమత్‌పురం ప్రాంతాల్లో ప్రచారం చేశారు. పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలుసుకుని ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల్లో తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి, వేయించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస శివారెడ్డి, నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాలో ప్రతిభ



నమూనాలను ప్రదర్శిస్తున్న మొరార్జీ దేశాయి వసతి పాఠశాల విద్యార్థులు

పావగడ: తాలూకాలోని గుజ్జనడు గ్రామంలో ఉన్న మొరార్జీ దేశాయి వసతి పాఠశాల (ఎస్సీ వర్గం) విద్యార్థులు రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాలో ప్రథమ స్థానం సాధించి పావగడ ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో చాటారు. ఈ నెల 27, 28న బెంగుళూరు లోని అరమనె మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళా పోటీల్లో స్థానిక మొరార్జి వసతి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగానే 'ఉత్తమ పర్యావరణ ఆరోగ్యం–లాభదాయక సుస్థిర వ్యవసాయం' అనే అంశంపై నమూనాలు ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. షీల్డ్, ప్రశంసాపత్రంతో పాటు రూ.5 లక్షల నగదు బహుమానం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రథమ స్థానం సాధించి అవార్డు అందుకున్న విద్యార్థులు ఆర్ అనిత, ఎస్ మోహన్ కుమార్, ఏయూ చరణ్, ఎంఎం నిసర్గ ప్రియ, బిందుశ్రీలను స్థానిక మొరార్జి వసతి పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్, మారుతి, సైన్స్ టీచర్ శ్రీనివాస్, కేఎస్ శివకుమార్, బీఈఓ అశ్వర్థనారాయణ తదితరులు అభినందించారు.

# ఏఐసీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



నాగేంద్రను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన పట్టణానికి చెందిన నాగేంద్రకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక సీఅండ్ఐసీ మిషన్ కాంపౌండ్ చర్చిలో సంఘ డీకెన్ బోర్డ్ సభ్యులు, యూత్ క్రిస్టియన్ ఫెలోషిప్, సండే స్కూల్, సంఘ సభ్యులు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘ పాస్టర్ రెవరెండ్ స్టీఫన్ రాజ్, కార్యదర్శి క్రిస్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి స్పందన



అమరాపురం: దంతాలను పరీక్షిస్తున్న వైద్యుడు

అమరాపురం: స్థానిక ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుంచి స్పందన లభించింది, కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం నుంచి వచ్చిన స్త్రీల వ్యాధి నిపుణురాలు జ్యోతివిజయ్‌కుమార్ 180 మందిని పరీక్షించడంతో పాటు రూ.30 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. అలాగే బెంగళూరు నుంచి వచ్చిన దంత వైద్యులు నాగేంద్రకుమార్ 80 మంది పరీక్షించి మందులను అందజేశారు. కూటమి సభ్యుడు పద్మరాజ్ జైన్ మాట్లాడుతూ తాము బెంగళూరులో ఉన్నా ప్రతి నెలా తమ సంఘ సభ్యులతో కలసి ఉచితంగా మండలంలోని రోగులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రోగులకు కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, ఉపాధ్యాయుడు శ్రీనివాసమూర్తి, రమేష్‌బాబు, అజయ్‌కుమార్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత కంటి శిబిరం..**

హిందూపురం: మండల పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు లక్ష్మీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్ నాగభూషణరెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించగా.. ప్రజలకు పెద్ద ఎత్తున కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## కనుల పండువగా బ్రహ్మరథోత్సవం



అలంకరణలో కోడిరంగనాథస్వామి

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామంలో వెలసిన కోడిరంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణులు వేద మంత్రాలు, హోమాలతో కోడిరంగనాథస్వామికి విశేషంగా పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని గ్రామపెద్దలు, అర్చకులు సమక్షంలో తీసుకుని వచ్చి బ్రహ్మరథంపై కూర్చోబెట్టారు. మేళతాళలతో, మంగళ వాయిద్యాలతో స్వామి వారిని ఊరేగింపు చేశారు. గ్రామ సర్పంచ్ నేత్రావతి, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, గ్రామ పెద్దలు మొదట పూజలు నిర్వహించారు. దేవాలయం నుంచి అశ్వర్థకట్ట వరకు ఊరేగింపు జరిగింది. బ్రహ్మరథోత్సవానికి విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.



కోడిరంగనాథస్వామి బ్రహ్మరథాన్ని లాగుతున్న భక్తులు



రథం ముందు కోలాటం చేస్తున్న యువకులు